# గ్రుక్కెడు నీళ్లు

బందా కనకలింగేశ్వరరావు

'దూరంగా ఉండరా, కళ్లు కనపడటల్లేదు?'

'................'

'నిన్నే ; మాట వినిపించుకోవేమిరా, మాయస్వరాజ్యం వచ్చిందని మండిపడిపోతున్నా వేం?'

'..............'

'దూరంగా పోరా' అని మునసబు వెంకటస్వామి మందలించగానే వెంకటప్ప తప్పుకున్నాడు. మహలక్ష్మమ్మగారు మడినీళ్లు పట్టుకుని వెళ్లింది.

ఇల్లు చేరగానే మహలక్ష్మమ్మ, మడినీళ్ల బిందె దింపి, అరుగుమీద పెద్దమనుష్యులతో మాట్లాడే భర్తను 'ఒకమాటిలా రండి' అని లోపలికి పిలిచింది.

కూరసంగతి కనుక్కోటానికి గావును లోపలికి రమ్మన్న దనుకొని లోపలికి వెళ్లాడు బ్రహ్మయ్య.

'చూడండి! వెంకటప్ప కంత పొయ్యేకాలం వచ్చిందేం, దారి తప్పుకోరా అంటే తలతిక్కతనంగా వినిపించుకోడు, కాస్త కనుక్కోకపోతే ఆడవాళ్లం మడినీళ్లు తేలేం' అని కసిరింది మహలక్ష్మమ్మ.

'కనుక్కుంటాలే' అంటూ కరణం బ్రహ్మయ్య వాకిట్లోకి వచ్చి కబురంపేడు వెంకటప్పకు.

వెంకటప్ప ఊరు వెట్టి. ఆ ఊళ్లో వాడొక్కడే మాల. తల్లి దండ్రులు చిన్నతనంలో పోవటం చేత గాలికి పెరిగి ధూళికి ఎదిగి కన్నంగట్టుమీద చుట్టుగుడిసె వేసుకుని కాపురం ఉంటున్నాడు వెంకటప్ప. పుట్టుక తక్కువైనా బుద్ధిమంతుడు. అందువల్ల ఊళ్లోవాళ్లు బట్టలు పాతలు ఇస్తూ అంత పచ్చడి ధవ్వ, ఇంత పప్పుచారు పెడుతూ ఆదరంగా చూస్తుండేవారు.

కరణంగారి కోపానికి కాకైనా అదురుతుంది. అలాంటప్పుడు వెట్టిపని చేసే వెంకటప్పకు చెప్పాలా! వెంటనే కరణం బ్రహ్మయ్యగారింటి కెళ్లి దణ్ణం పెట్టేడు.

బ్రహ్మయ్యగారు వెంకటప్పను చూడగానే మనుష్యునకు రావలసినంత కోపం తెప్పించుకొని ఎడమకాలి పాతచెప్పు తీసి వెంకటప్ప మొగానకొట్టేడు. అది చాలక బండబూతులు తిట్టి బొండకొయ్య వేయించాడు. ఏం చేస్తాడు వెంకటప్ప? తల వంచుకొని దండన భరించాడు. ఇంతకు వెంకటప్ప చేసిన తప్పేమిటో!

బ్రహ్మయ్యగారు బ్రాహ్మణులు. ఊరికరణం. రామవరంలో వారంటే మంచి పలుకుబడి

ఉంది. వ్యాజ్యాలలో మధ్యవర్తిత్వం చెయాలన్నా, అన్నదమ్ముల పాల పంపుళ్లు పెట్టాలన్నా, కవులుకత్తులు వీళ్లు గాని వ్రాయాలన్నా, లక్షాధికారి లక్ష్మణస్వామైనా ఆయనకే కబురంపాలి. ఏభైవేల రూపాయీల నగదు, పాతిక ఎకరముల భూమి, పురాతనపు ఇల్లు, ఆయన కున్న ఆస్తి. కాని ఎన్నుంటేయేం, బిడ్డలు లేరు. ఎలాగైనా ఒక్క కాయ కాస్తుందేమోయని తాయత్తుల మీద తాయత్తులూ, జపాల మీద జపాలు, తపాలుమీద తపాలు, ఇక యేమిటి! సూర్యనమస్కారాలే కాదు సుందర కాండపారాయణాలే కాదు, పుత్రకామేష్టి వ్రతాలే కాదు, పుణ్యతీర్థాల మునుగటమే కాదు, గోసాయీల వేరుముక్కలే కాదు, గోకుల బృందావనదర్శనాలే కాదు, ఎన్ని చేసినా ఒక్క పిల్లడు గాని, పోని పిల్లయినా కలుగలేదు. భోగేశ్వరం దేవుడికి మ్రొక్కేరు. మ్రొక్కటమే కాదు, స్నానంచేసి తడిగుడ్డతో తెల్లవార్లు సాగిలపడ్డది మహలక్ష్మమ్మ గుడివెనుక : అబ్బే ! మాటవరసకైనా నెల తప్పలేదు.

కాలం ఒక్కమాదిరిగా ఉండదు. రామవరంలో కొంచెం కలరా తటస్థించింది. కొంచెంగా ఉన్నదల్లా కొద్దిరోజుల్లో గొప్పదైనది. రోజా నాలుగైదు పీనుగలు వెడుతున్నాయి. ప్రొద్దు క్రుంకితే తలుపు తీయటంలేదు. వీధులలో సంచారం కనపడటల్లేదు. మునసబు వెంకటస్వామి ముడుపులు గట్టించాడు. మ్రొక్కే దేవతలకు మ్రొక్కుతున్నారు. చేసేపూజలు చేస్తున్నారు. గణాచార్లు మీద గణాచార్లు. మంగలితిర్పతి గాని భార్యకు మారెమ్మ పూనింది. గవళ్ల గుంగులు చెల్లెలుకు గంగానమ్మ పూనింది. చాకలి పేరాయ మరదలుకు చల్లలమ్మ, పోలిసాని ఆడబడుచుకు పోలేరమ్మ పూనింది. 'అయ్యో మా అక్కయ్య, నే వస్తున్నానే' అంటూ వచ్చాడు గాలి వీరయ్య. 'ఎవరు నువ్వ'న్నాడు వెంకటస్వామి. సమయం దొరికినప్పుడే తిట్టాలనుకొని వీరయ్య 'ఎవరో ఎరుగవట్రా గాడిద! నేపోతరాజునురా' అన్నాడు. ఈ ప్రకారంగా వారి వెనుక వీరు, వీరి వెనుక వారు, చల్లాలమ్మ, గొడ్డళ్లమ్మ, మారెమ్మ, మహలక్ష్మమ్మ, పోలేరమ్మ, పెద్దింటమ్మ, కామాక్షమ్మ, గంగానమ్మ, కనక దుర్గమ్మ, గావుశక్తెమ్మ, దిబ్బమ్మ తీర్థమమ్మ - 'ఓ', స్నానాలు చేసి బండెడు వేపమండలు చేత బట్టుకొని గెంతి తాండవమాడుతున్నారు వీధుల వెంబడి. డప్పులు తడవతడవకూ కాచి మరీ కొడుతున్నారు. వీరయ్య సిస్తు ఇవ్వలేదనే కోపంచేత కరణం బ్రహ్మయ్య కేకలువేతా మనుకొని వచ్చేటప్పటికి వీరయ్య పోతరాజు రూపాన కరణంగారి పీక పట్టుకున్నాడు. పది మంది గుమిగూడి విడిపించారు. పెద్ద కాపు రాఘవయ్య విడదీసి వీరయ్యను మందలించాడు. బ్రహ్మయ్యగారి ఒళ్లు ఝల్లుమన్నది. పదిమంది ఇంటికి చేర్చారు. దేవతలంతా ఈ దెబ్బలాటలో బాగుండదని ఊరుకున్నారు. ఏం గావాలో చెప్పి చేయించుకోవాలి గాని మనుష్యులను చంపితే ఎలా గన్నాడు రాఘవయ్య దేవతల్తోటి. దేవతలకు మనభాష బాగా తెలుసుట !

'ఓ! నరుడ నరుడ నరుడ నరుడో! నాకు పదివేలెట్టి గుడి కట్టించరో ! లేకపోతే నెత్తురు తాగేస్తారో' అంది గంగానమ్మ.

'నాకు కొత్తది తోపు రంగు పెడననేత జరీచీరె పెడితే గాని మింగుతా' నంది పోలేరమ్మ.

'ఇంటికి కుంచెడు చొప్పున వసూలుచేసి నా కిస్తే గాని ఊరు నాశనంచేస్తా' నంది పల్లాలమ్మ.

'వాళ్లందరకన్న నే తీసిపోయినానా ! ధోవతుల్చాపు మంచిది ఇవ్వండి, మొగదేవుడిని కూడా' నన్నాడు పోతరాజు. ఇవి వీరి కోరికలు.

'మావల్ల ఏం గావు! మీ యిష్ట మొచ్చినట్లు చెయ్యండి; మర్యాదగా కావాలంటే జాతరచేస్తాం, లేకపోతేమీ పెద్దదేవత కాళెమ్మ దగ్గర్నుంచి తిరుగుటపాలో ఏ సంగతి కనుకోం' డన్నాడు మునసబు.

'చద్దివణ్ణాల కెల్లా' లని డప్పుల వాళ్లు దారిపట్టేరు. ఆ నాటికథ అలా ముగిసింది.

ఇంటి కొచ్చిన కరణం బ్రహ్మయ్యకు స్పృహలేదు. వాంతులు ప్రారంభించి కలరాలోనికి దింపినవి. మందు లేదు, మాకు లేదు. పాపం తోడునీడ లేరు. మహలక్ష్మమ్మ ఉపచారం చేస్తోంది. ఏం చెయ్యగలదు ఒక్కతి? కంటికి మంటి కేకధారగా ఏడ్చింది, పాపం, పసుపు కుంకుమ పోయేరోజు వచ్చిందని. చూస్తూ చూస్తూ ఉండగానే పెనిమిటి కాళ్లు చేతులు చల్లబడినవి. గొల్లుమన్నది ఇల్లాలు. తిరిగి చూసేవారైనా లేరు. ఓదార్చేవారు లేరు. లంకంతకొంప. పిట్టచప్పు డైనా లేదు. గ్రుడ్లగూబ మాత్రం నేనున్నా నన్నట్లుగా దూరాన్నుంచి కూసింది. భర్తశవం మీద పడి రోదనం చేసి చేసి మూర్ఛపోయింది మహలక్ష్మమ్మ.

తెల్ల వారింది. సూర్యుడుదయించాడు. పశువుల చప్పుడు తప్ప వీధిలో సంచారం లేదు. ఊరంతా గొడ్డుపోయినట్లుంది. మహలక్ష్మమ్మ దుఃఖానికి మేరలేదు. కర్తవ్యం కూడా మరచింది. బిడ్డలేని లోపం కనపడింది. చుట్టుప్రక్కలవాళ్లు గాని తనవాళ్లు గాని ఎవరూ రాలేదు. కలరా అంటువ్యాధి. అందుచేతనే గావును ఎవ్వరూ తనకు ఊళ్లో ఉన్న అన్న గారైనా తొంగిచూడలేదు. నెమ్మదిగా లేచి, వస్తున్న దుఃఖమును ఆపుకొని, శవం తీసుకెళ్లే ప్రయత్నం కోసం బయలుదేరింది. వెనుక వీధిలోని పుట్టింటివారింటి కెళ్లింది. దూరాన్నుంచి ఈమెను చూచి కామయ్య దొడ్లోకెళ్లేడు. ఒదినగారిని చూచి బావురుమని ఏడ్చింది మహలక్ష్మమ్మ. 'ఎంత ఆపద ఒదినా' అంటూ గుడ్ల నీరు గ్రుక్కుకొన్నది మరదలు. కామయ్య ఇంట్లోకి వచ్చి చెల్లెలును జూచి కౌగలించుకొని ఏడ్చేడు కాస్సేపు. 'చెల్లీ, శవంమాట ఎల్లాగే' అన్నాడు కామయ్య. 'అన్నిటికి నువ్వే చూడాలి అన్నయ్యా' అన్నది చెల్లెలు. 'నేనూ అదే చూస్తున్నాను. మీవదినెకు ఏడో నెల ! పోనీ, పదిరూపాయిలు పారేదామంటే పల్లెటూరు' అన్నాడు కామయ్య.మహలక్ష్మమ్మ కాసంగతి వింతగా తోచింది. ఒదినే, తను క్రిందటి ఏకాదసినాడే స్నానం చేశారు. పెదవి విరచింది. సంగతి గ్రహించింది. తన మరదైన సూరయ్య గారింటికి త్రోవ పట్టింది. తోడికోడలు వాకిట్లోకి వచ్చి ఊరడిస్తో 'మరది లేరమ్మా, మారుటే రెళ్లా' రంది. మహలక్ష్మమ్మ తెల్లబోయింది. తాను వీధివాకిలి గుండా వస్తే బాగుండదని దొడ్డి త్రోవగుండా వస్తుంటే సూరయ్య గారు చుట్ట కాల్చుకుంటూ బయటి కెళ్లటం చూచింది. ఇదంతా కాలమహత్యం అనుకుంది. కలరా గాలి కింతభయం గావుననుకున్నది. పోనిమ్మని పెరటివీధిని ఆడపడుచుగారింటి కెళ్లింది. 'పుట్టెడు దుఃఖంతో మాచమ్మా, నీ కెంత చిక్కు వచ్చిందే ; అన్నయ్య దాటిపోయినాడటే' అని బావురు మన్నది సుందరమ్మ. కళ్ల నీళ్లు తుడుచుకుంటూ 'రాత్రి వస్తామనుకొన్నా నమ్మా! మీ అన్నయ్య జ్వరంతో మూల్గుతుంటే ఎలా విడిచిరాను' అని చక్రం అడ్డువేసింది సుందరమ్మ. మహలక్ష్మమ్మ వెనుతిరిగి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటు వస్తున్నది. ఊరట చెందట మేలాగు? శవాన్ని తీసికెళ్లేవారైనా లేరు. ఆమె రోదనమును విని ప్రకృతి కూడా విలపిస్తూంది. ఆవుల మందలు తప్ప మానవ పురుగులేదా వీధిని. "మేము మనుష్యులమైనా కాకపోతిమే శవాన్ని తీసుకొని వెళ్లేందు" కని గావును, తలలు పంకిస్తున్నవి గోవులు. మానవవిశ్వాసమును తిరస్కరిస్తూ కావును, యింటికుక్క కంట నీరు పెట్టింది. కష్టదశ వచ్చినప్పుడే కావాలి బంధువులు.

తల వంచుకొని వస్తూంది మహలక్ష్మమ్మ. దారిలో వీధిబడి దగ్గర కనపడ్డాడు వెంకటప్ప. తల వంచుకున్నది మహలక్ష్మమ్మ. "అమ్మగారూ, మా గొప్ప ఆపద సంభవించిందండీ" అన్నాడు వెంకటప్ప. పయిటకొంగుతో కళ్లు తుడుచుకొన్నది.

"ఊరుకోండమ్మ, తక్కిన పని చూడం" డన్నాడు.

గద్గదస్వరముతో "వెంకటప్పా! కరణంగారి శవము తీసుక వెళ్లుదాము వస్తావా" అన్నది.

"అమ్మో ! మాలోండ్లమం" డన్నాడు.

"పరవాలేదు, వస్తావట్రా? ఈ సహాయం చెయ్యి నీకడుపున పుడతా" నన్నది.

"మీకు లేకపోతే నాకు భయంలే" దన్నాడు వెంకటప్ప.

"అయ్యో మీవాండ్లేమైనా అంటారేమో,అమ్మ వారిజాడ్యం, అంటుజాడ్యము కూడాను."

"నా కెవరండీ యేడ్చేవాండ్లు. కన్న వాండ్లు గంగ కలిసిపోయేరు" అంటూనే పాడె తయారుచేసేడు వెంకటప్ప.

వెంకటప్ప, మహలక్ష్మమ్మ చెరొకవైపు పట్టుకొని శవమును తీసికెళ్లారు.

పురోహితుడు లేడు పుణ్యపురుషుడు లేడు. మహలక్ష్మమ్మ హృదయం శాంతి పడ్డది. ఎల్లా తను వాడి ఋణం తీర్చవలెనా అనుకొన్నది......

* * *

వెంకటప్ప తిరిగి యింటికి వస్తున్నాడు. కొంచెం కడుపులో బాధగా వుంది. కళ్లు తిరుగటం మొదలు పెట్టినవి. కొంచెము సేపటిలో కాళ్లు చేతులు లాక్కొని పోవటం మొదలు పెట్టినవి. వాంతులు ప్రారంభించి అవయవ పటుత్వం తప్పి స్పృహలేకుండా మునసబు వెంకటస్వామి యింటి యొద్ద పడిపోయినాడు వెంకటప్ప. వెంకటప్పకు కలరా తగిలిందన్నమాట ప్రాకింది వూరంతా. వెంటనే మునసబు వూళ్లో కలరాటీకాలు వేస్తున్న కలరా డాక్టరుకు కబురంపేడు. వెంకటప్పకు 'నా' అన్నవారు లేరు. బట్టలు మలమూత్రములతో నిండిపోయినవి. చూస్తూ వూరుకున్నారు చుట్టుప్రక్కలవారు, గారడివాడిని చూచినట్లు. ఇంతటిలో ఒక పూర్వ సువాసినీ దేవత కుడి భుజము మీద తడివస్త్రాలు యెడమ భుజము మీద మడినీళ్లు పట్టుకుని తను త్రొక్కపొయ్యే దారిపొడుగున నీళ్లు చల్లుచు తులసిపాటో లేక గోవిందరామపాటో గొణుగుకుంటూ వస్తూంది. వెంకటప్పను చూడలేదు. దాహం దాహం అని మూల్గుతున్నాడు. 'పాపం యెవళ్లైనా పొయ్యండిరా' అని ఒకడు, 'యేంచెయ్యగలం భగవత్ యత్నం" అని ఒకరు, 'దిక్కు లేనివానికి దేవుడే దిక్క'ని ఒకరు, కంటితో లేకపోయినా నోటితో యేడుస్తున్నారు. వినలేదు, యీ సంగతి, మడినీళ్ల వెధవావిడె. చూడలేదు, యెదుట నున్న వెంకటప్పను దగ్గిర కొచ్చినదాక. వెంకటప్పకు గజం దగ్గర కొచ్చి, "అయ్యో, నీయమ్మకడుపుకాల. వెధవవాళ్లం, బ్రాహ్మణులం, మడినీళ్లు తెస్తుంటే చెప్పనక్కరలేదురా? కొంప తీసేవు" అని బిందెడు నీళ్లు మయిలపడినవని తిట్టుతూ వెంకటప్ప మీద పోసింది. వెంకటప్పకు స్పృహలేదు. ఆమె కోపంతో పోసిననీళ్లు అతని దాహం తీర్చినవి. ఆయాసంతో మూల్గుతు కొంచెము ప్రక్కకు దొర్లినాడు, వెంకటప్ప, బ్రాహ్మణుల త్రోవ మయిలపర్చట మెందుకని. ఇంతటిలోనే కలరా డాక్టరు వచ్చి నాడి చూచి మించి పోలేదనుకున్నాడు. గొంతుకలో మాత్రలు వేసి

నల్లనిచుక్కలు నీళ్లలో కలిపి పోశాడు మహానుభావుడు. మునసబు వెంకటస్వామి కొంచెము అసహ్యించుకున్నాడు. డాక్టరు తనకులము వాడు అనగా తెలగ మాలవానిని ముట్టుకొని కాళ్లు పిసుకుతున్నాడని. ఈ తెలగ యీ వెంకటస్వామి నాయుడు పెద్దకాపు వెనుక బ్రాహ్మణులు భోజనం చేస్తుంటే తనని రానివ్వకపోవటమేమిటని దెబ్బలాడిన పెద్దమనిషి; ఈనాడు డాక్టరును కొంచెము కోరచూపుతో చూచాడు.

వెంకటప్ప సంగతి మహలక్ష్మమ్మగారు విన్నది, రోడ్డుమీద స్పృహ లేకుండా పడిపోయినాడని. కర్తవ్యం గ్రహించి వెంటనే నిట్టూర్పు విడిచి, వెలిలేసినా సరే అనుకుంది. తొందర తొందరగా వీధిలోనికి పోయి వెంకటప్పను చూచింది. కన్నతల్లి లాగున కంట తడిపెట్టినది. చుట్టు వున్న వాళ్లు మందలిస్తూనే వున్నారు. నెమ్మదిగా లేవతీసినది. తన మెడమీద అతని చెయ్యి వేసుకొని నెమ్మదిగా నడిపించుకుంటూ తనయింటికి తీసికొని వచ్చి పడుకుండబెట్టింది. పాపము ఆమె మాతృప్రేమ యెటువంటిదో యెరుగదు. కాని నేటికి ఆమె కడుపులోని తల్లి పేగు తరుగుకొని పోవుచున్నది. దుఃఖం దిగమ్రింగుకుంటూ ఉపచారం చేస్తున్నది. మాడుకు పట్టు వేస్తూ వెంకటప్ప మొగంవంక చూచింది. దైవము అనుకూలంగా ఉండటం వల్ల గావును వెంకటప్ప కనులు తెరచి చూచాడు. కళ్లవెంట నీళ్లు యేకధారగా కారుచున్నవి. బిక్కమొగముతో వెక్కి వెక్కి యేడవటం మొదలు పెట్టాడు. తన పయిట కొంగుతో మహలక్ష్మమ్మ వెంకటప్ప కంటి నీళ్లు అద్దినది.

"ఎందుకు యేడుస్తావు వెంకటప్పా" అని చెంపలు నిమిరింది తల్లి ప్రేమతో. "నేను మాలవాడిని అమ్మా" అన్నాడు వెంకటప్ప. అంటూనే చిన్న పిల్లవాని లాగున యేడ్చాడు.

"అయ్యో, అంతమాత్రముకు యేడుస్తావు యెందుకు?"

"మీరు బ్రాహ్మణులు నేను కడజాతి వాడను".

"కావు. కావు; నీవు నాకు కొడుకువు. సందేహం లేదు. కాక పోతే నాగర్భం యెన్నడూ యీ మాదిరిగా దుఃఖించలేదు. నాయనా, యీ జన్మలో కాకపోయినా పూర్వజన్మలోనైన అయివుంటావు. అందువల్ల నే తండ్రిగారి ఋణం తీర్చగలిగావు."

• • •

వారం తిరిగింది. మహలక్ష్మమ్మను కులంవారు వెలివైచినారు. ఆ బాలగోపాలం ఆమె యింటివంకనైనా తిరిగి చూడలేదు. మునసబు వెంకటస్వామిగారి ఆజ్ఞ ప్రకారం చాకలి మంగళ్లు కూడా కట్టుకట్టినారు. వెంకటప్ప మలిన వస్త్రముల సయితము మహలక్ష్మమ్మ వుతుకుతున్నది. దైవానుగ్రహం వల్ల, వెంకటప్ప తేరుకున్నాడు. కొంచెము యిటూ అటూ తిరుగుతున్నాడు. మహలక్ష్మమ్మ తల్లి పత్యం పెట్టింది. నీరసంగా వుండటం వల్ల అబిడే కలిపి పెట్టుతూ వుంది. ఇంటి కోమటి వంట కర్పులు గూడ అమ్మటం లేదు. మహలక్ష్మమ్మకు బెంగ పడిపోయింది. కాని ధైర్యవంతురాలవడం వల్ల సమస్తచాకిరీ చేస్తున్నది. అతని పాలిటికి ఆమెయే మాతృదేవతయైనది. నిర్భాగ్యుడు వెంకటప్ప. "అమ్మా" అని పిలుచుకునే యోగ్యత లేదు. ఇతని పరిచర్య చెయ్యటం వల్ల ఆమెకు కొంచెము జ్వరం తటస్థించింది. నెమ్మదిగా మంచము పట్టించింది. ఇప్పుడు ఆమెకు సేవ చెయ్యటం వెంకటప్ప వంతు అయినది. మందుమాకులు లేనిదే జ్వరం తగ్గట మేలాగు? వైద్య

మహాశయులు కూడా వెలివైచారు, మునసబు, వెంకటస్వామిగారి తీవ్ర శాసనం చేత. వీరి శాసనం వైస్రాయి గారి అర్డినెన్సుల కన్న బలమైనది. అర్డినెన్సులనైన తిరస్కరిస్తారు గాని ప్రజలు, మునసబు వెంకటస్వామిగారి ముక్కోపితనానికి జడవని మునలిదైనా లేదు. వారే పల్లెటూరి ప్రభువులు.

* * *

రాత్రి తొమ్మిదిగంటలయినది. జ్వరం మిక్కుటముగా వుంది. మైకం తల కెక్కుతున్నది. తనకాలం ఘడియల మీద వుందని గ్రహించింది. కాళ్లు పిసుకుతున్న వెంకటప్పను దగ్గరకు తీసుకున్నది. ఆలుమారు తాళం చెవులు తెమ్మని ఆయాసంతో చెప్పింది. అందులోని తాను అక్రితం రోజునే వెంకటప్పకు తెలియకుండా వ్రాసిన వీలు చదివింది. యావదాస్తి అతని పేర వ్రాసింది. ఇనుప పెట్టెలోని లెక్కగా యాబదివేల రూపాయిల నోట్లు అతనికిచ్చి, "నాయనా, నాకు పుత్రులు లేరనే లోపం తీర్చావు. మాతాపితరుల రుణం తీర్చటం నీకు అందువల్లనే గలిగింది. ఇందులో సగం నీవు తీసుకొని తక్కిన సగం అస్పృశ్యతా నివారణకోసం ప్రచారం చేసి వారలకు గృహములు సత్రములు కట్టించవలెను. వారలకై చెరువులు బావులు త్రవ్వించు. ఈపుణ్యకర్తవ్యం నీకు అప్పగించుతున్నాను. మాఋణం యెల్లా తీర్చావో మాకొక్కె కూడా అలాగుననే నెరవేర్చు. నీవే ముందు జన్మంలో కూడా నాకు పుత్రుడవుకావాలని సర్వేశ్వరుడిని ప్రార్థిస్తున్నాను" అంది. ఆయాసం యెక్కువైంది మహలక్ష్మమ్మకు. వెంకటప్పను దొడ్డిలోని తులసియాకు తెచ్చి నీటిలో కలపమన్నది. ఆ నీళ్లు గొంతుకలో పొయ్యమన్నది. సందేహించాడు వెంకటప్ప మరణకాలమందున మహలక్ష్మమ్మ తల్లికి మాలవాని చేత నీరా అని. ఆయాసం యెక్కువవటం వల్ల చెప్పలేక చెప్పలేక, "గ్రుక్కెడు నీళ్లు" అన్నది. వెంకటప్ప సందేహం నివారణమయినది. వెంటనే తులసితీర్థం గొంతుకలో పోసి తల్లిరుణం తీర్చుకున్నాడు. కాళ్లు చేతులు చల్లబడినవి మహలక్ష్మమ్మకు. కడసారివందనం చెబుతా మనుకున్నాడు. కాని కాలం చేసింది కన్నతల్లి. దుఃఖముతో చిన్న పిల్లవానిలాగున యేడుస్తూ ఆమె శరీరం మీద పడి మూర్ఛపోయాడు వెంకటప్ప.

"కర్రలే చుట్టాలు కట్టెలే బంధువులు
కన్నతల్లెవ్వరే చిలుకా"
అని పాడుతూ ఉదయం దాసరి లేపినదాకా ప్రపంచం యెరుగడు వెంకటప్ప.

భారతి, మే 1932.